క్లుప్తంగా

వికసించిన బ్రహ్మ కమలం



నర్సంపేట: పట్టణంలో గురువారం రాత్రి బ్రహ్మ కమలం వికసించింది. రాంలీలా నివాస్ ఇంటి ఆవరణలోని ఈ బ్రహ్మకమలాన్ని చూసేందుకు స్థానికులు తరలివచ్చారు. తమ సెల్‌ఫోన్లలో బ్రహ్మకమలం పుష్పాన్ని బంధించారు.

ఘనంగా తీజ్



నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని రాములునాయక్‌తండాలో గురువారం రాత్రి తీజ్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేడుకలకు నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. మహిళలతో కలిసి తీజ్ వేడుకల్లో భాగస్వాములయ్యారు. అనంతరం మహిళలు గోధుమమ బుట్టలను డీజే, డప్పు చప్పుళ్ల నడుమ ర్యాలీగా వెళ్లి నిమ్మజ్జనం చేశారు.

వైభవంగా సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠాపన



సంగెం : మండలంలోని ఎల్గూర్ స్టేషన్ పరిధిలో నిర్మించిన ఆలయంలో సాయిబాబా విగ్రహాన్ని గురువారం వేడుకగా ప్రతిష్ఠించారు. మందిర నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం గణపతి పూజతో ప్రతిష్ఠాపన మహోత్సవం ప్రారంభమైన విషయం తెలిసిందే. ఈ క్రమంలో గురువారం నాడు వేదపండితులు సాయిబాబా విగ్రహాన్ని శాస్త్రోక్తగా ప్రతిష్ఠించారు. అనంతరం అన్నదానం చేశారు.

శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల ముగింపు



చెన్నారావుపేట : మండలంలోని జల్లిలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి, ఇందూ జ్ఞాన వేదిక వరంగల్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల ముగింపు నిర్వహించారు. ఈనెల 26న వేదిక నిర్మించగా స్వామి వారు కొలువుదీరారు. ప్రతీరోజు పూజించారు. గురువారం నాడు శ్రీ కృష్ణుడి ప్రతిమను గ్రామంలో ఊరేగించారు. వేడుకల్లో ఇందూ జ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు ఓంప్రకాశ్ ఆచారి, మాజీ ఎంపీపీ జక్క అశోక్, తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ షోరూం ఎదుట ఆందోళన

నర్సంపేట : పట్టణంలోని మహేంద్ర ట్రాక్టర్ షోరూం ఎదుట ఖానాపురం మండలానికి చెందిన పలువురు వినియోగదారులు గురువారం ఆందోళన చేపట్టారు. షోరూంలో పని చేస్తున్న వర్కర్లను బయటకు పంపి తాళం వేశారు. ఈ సందర్భంగా వినియోగదారులు మాట్లాడారు. నాలుగేళ్ల క్రితం హార్వెస్టర్ కొనుగోలు చేసినా ఇప్పటివరకు రిజిస్ట్రేషన్ కావడం లేదని వాపోయారు. తమకు న్యాయం చేయాలని కోరారు.

బైండోవర్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

చెన్నారావుపేట : బైండోవర్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ నరేశ్‌రెడ్డి తెలిపారు. మండలంలోని అడ్డబాటతండాకు చెందిన భూక్యా రాజు నల్లబెల్లం రవాణా చేస్తుండగా రూ.70 వేల జరిమానా విధించారు. ఈ సందర్భంగా సీఐ నరేశ్ మాట్లాడారు. రాజు గతంలో నల్లబెల్లం, గుడుంబా విక్రయిస్తూ పట్టుబడగా బైండోవర్ చేశామన్నారు. మళ్లీ నల్లబెల్లం, గుడుంబా విక్రయించడంతో జరిమానా విధించినట్టు చెప్పారు.

గుడుంబా స్వాధీనం

గీసుకొండ : మండలంలోని మచ్చాపూర్ శివారులో సంగెం మండలంలోని నల్లబెల్లి నుంచి మూడు నవీన్ బైక్‌పై రవాణా చేస్తున్న 10 లీటర్ల గుడుంబాను ఎక్సైజ్ పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితుడిని తహసీల్దార్ రియాజుద్దీన్ ఎదుట బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సీఐ తాతాజీ మాట్లాడారు. రూట్ వాచ్ చేస్తుండగా నవీన్ నుంచి గుడుంబా, బైక్ స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

నర్సంపేట : పూలమాల వేస్తున్న ప్రిన్సిపాల్ నవీన్



దుగ్గొండి : కేక్ కట్ చేస్తున్న రాజ్‌కుమార్



చెన్నారావుపేట : గేమ్ ఆడుతున్న విద్యార్థినులు



ధ్యాన్‌చంద్ స్ఫూర్తి కొనసాగించాలి

అంతర్జాతీయ హాకీ క్రీడాకారుడిగా దేశ చరిత్రలో సుస్థిర స్థానం సంపాదించుకున్న ధ్యాన్‌చంద్ స్ఫూర్తితో విద్యార్థులు క్రీడల్లో రాణించాలని వక్తలు పిలుపునిచ్చారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పుస్కరించుకుని నర్సంపేట, దుగ్గొండి, చెన్నారావుపేట, పర్వతగిరి, వర్ధన్నపేట, ఖానాపురం, నల్లబెల్లి, సంగెం, రాయపర్తి, తదితర మండలాల్లో ర్యాలీలు తీశారు. కళాశాలలు, స్కూళ్లలో విద్యార్థులకు క్రీడాపోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. తొలుత ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

-సాక్షి నెట్‌వర్క్



పర్వతగిరి : కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు



రాయపర్తి : బహుమతి ఇస్తున్న ఉపాధ్యాయులు



నల్లబెల్లి : మేడపల్లి హైస్కూల్‌లో నివాళులర్పిస్తున్న హెచ్‌ఎం కృష్ణమూర్తి, పీడీ రవీందర్, తదితరులు



వర్ధన్నపేట:నివాళులర్పిస్తున్న టీచర్లు, విద్యార్థులు



నర్సంపేట రూరల్ : నివాళులర్పిస్తున్న టీచర్లు



నర్సంపేట : నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ జ్యోతి

దుగ్గొండి : తెలుగు భాషా దినోత్సవంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు



తెలుగు ఔన్నత్యాన్ని చాటండి

నర్సంపేట : తెలుగు భాష ఔన్నత్యాన్ని దశదిశలా చాటాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మల్లం నవీన్ ఆకాంక్షించారు. తెలుగు భాషా పితామహుడు గిడుగు రామమూర్తి చిత్రపటానికి ప్రిన్సిపాల్, అధ్యాపకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆ కళాశాలలో గురువారం నిర్వహించిన తెలుగు భాషా దినోత్సవానికి ఆయన అధ్యక్షత వహించి ప్రసంగించగా తెలుగు విభాగం అధ్యాపకులు ఎస్.రజిత సమన్వయ కర్తగా వ్యవహరించారు. 'నాకు నచ్చిన కవి/రచయిత' అంశంపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. పోటీలో 30 మంది విద్యార్థులను ఉత్సాహంగా పాల్గొనగా వారిని ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు బైరి సత్యనారాయణ, డాక్టర్ కందాల సత్యనారాయణ, ఎస్.కమలాకర్, రహీమోద్దీన్, రాంబాబు, సోమయ్య, జె.రాజీరు, ఆర్.రుద్రాణి, డి.సంధ్య, బి.గాయత్రి, వి.పూర్ణచందర్, బి.వీరన్న, నిజాము, అనిత పాల్గొన్నారు.

దుగ్గొండి : మండలంలోని నాచినపల్లి ప్రభుత్వ హైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో హెచ్‌ఎం జ్యోతిలక్ష్మి మాట్లాడారు. తొలుత విద్యార్థులకు తెలుగు పాటల, కవితల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కమల, సుమలత, గీత, మధుసూదన్, సుధీర్, వెంకన్న, ప్రదీప్, రాధిక పాల్గొన్నారు.

చెన్నారావుపేట : మండల కేంద్రంలోని సిద్దార్థ హైస్కూల్‌లో తెలుగు భాషా పితామహుడు గిడుగు రామమూర్తి చిత్రపటానికి సిద్దార్థ విద్యాసంస్థల చైర్మన్ కంది గోపాల్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. తెలుగు భాషపై చిత్రీకరించిన చార్టులను ప్రదర్శించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అండెం కరుణాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు అలుగోజు వీరాచారి, చేరాలు, వెంకటేశ్వర్లు, గీత, సృజన, తదితరులు ఉన్నారు.



చెన్నారావుపేట : విద్యార్థులతో గోపాల్‌రెడ్డి



నెక్కొండ : మాట్లాడుతున్న మురళీధర్

నెక్కొండ : మండల కేంద్రంలోని గౌతమి విద్యానికేత్ హైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కరస్పాండెంట్ అనంతుల మురళీధర్ మాట్లాడారు. విద్యార్థులకు ఉపన్యాస, వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులను అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అనంతుల కల్పన, ఉపాధ్యాయులు సైకిలాబ్ పాషా, దయాకర్, మధుకర్‌రెడ్డి, సుజిత్, అజయ్, కరుణశ్రీ, విజయ పాల్గొన్నారు.

మహాయజ్ఞంలా బీజేపీ సభ్యత్వ నమోదు



నర్సంపేట : మాట్లాడుతున్న రాణాప్రతాప్‌రెడ్డి

నర్సంపేట : బీజేపీ సభ్యత్వ నమోదును మహాయజ్ఞంలా చేపట్టాలని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణాప్రతాప్‌రెడ్డి కోరారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు గంగిడి మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు నియోజకవర్గ ప్రముఖ్ వడ్డేపల్లి నర్సింహరాములు అధ్యక్షతన గురువారం నిర్వహించిన సమావేశానికి రాణాప్రతాప్‌రెడ్డి అతిథిగా హాజరై మాట్లాడారు. జాతీయవాదాన్ని సిద్ధాంతంగా, దేశరక్షణే లక్ష్యంగా పార్టీ ముందుకు సాగుతోందని చెప్పారు.సమావేశంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు రేసు శ్రీనివాస్, మహబూబాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గ కోకన్వీనర్ కట్ల రాంచందర్‌రెడ్డి, యువమోర్చా నియోజకవర్గ కన్వీనర్ ఆముదాల రమేశ్, సభ్యత్వ నమోదు మండల ప్రముఖ్ తనుగుల అంబేడ్కర్, మండల ప్రధాన కార్యదర్శులు తాళ్లపల్లి రాము, గంధం రాజుగౌడ్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు గోలి యుగేందర్, యువ మోర్చా మండల అధ్యక్షుడు వీరన్న, తదితరులు పాల్గొన్నారు.

దుగ్గొండి : మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు నేదురు రాజేందర్ అధ్యక్షతన నిర్వహించిన వర్క్‌షాప్‌లో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోగుల రాణాప్రతాపరెడ్డి పాల్గొని మాట్లాడారు. నాయకులు ప్రజాప్రతినిధులుగా ఎన్నిక కావాలంటే ప్రజలకు సేవ చేయడంతోపాటు సమస్యలపై పోరాడాలని సూచించారు. అనంతరం మండల పూర్తిస్థాయి కార్యవర్గాన్ని ప్రకటించి నియామక పత్రాలు అందజేశారు. సమావేశంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు రేసు శ్రీనివాస్, నాయకులు అన్న లింగన్న, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఫర్టిలైజర్ షాపులో తనిఖీ

నల్లబెల్లి : మండల కేంద్రంలోని ఫర్టిలైజర్, పెస్టిసైడ్స్, సీడ్స్ షాపుల్లో మండల వ్యవసాయ అధికారి (ఏఓ) రజిత గురువారం తనిఖీ చేశారు. స్టాక్, సేల్స్ రికార్డులతోపాటు విక్రయ బిల్లులు, ఇన్‌వాయిస్, పీసీలను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడారు. ఫర్టిలైజర్, పెస్టిసైడ్స్, సీడ్స్ వ్యాపారులు ఎరువులు, పురుగుల మందుల విక్రయంలో ప్రభుత్వ నిబంధనలు పాటించాలని చెప్పారు. అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎరువుల నిల్వలపై డీలర్లతో చర్చించారు. ఏఓ వెంట ఏఈఓ శ్రీకాంత్ ఉన్నారు.

పోలీసుల అదుపులో దొంగలు?

నర్సంపేట రూరల్: పట్టణంలోని వివేకానంద కాలనీలో ఉన్న మేడవరపు కమలాకర్‌రావు ఇంటిలో ఇటీవల చోరీ జరిగింది. ఈ దొంగతనానికి పాల్పడిన పలువురిని జనగామ జిల్లా పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలుస్తోంది. విశ్వసనీయ సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. వివేకానంద కాలనీలోని జరిగిన చోరీ ఘటనపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే, దొంగలు నబర్‌ప్లేట్ లేకుండా ఓ ప్రత్యేక వాహనంలో వెళ్తుండగా జనగామ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. వరంగల్ ఉమ్మడి జిల్లాలో జరిగిన పలు దొంగతనాల్లో కూడా వీరి హస్తమే ఉన్నట్లు నిర్ధారించి పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై నర్సంపేట పోలీసులను వివరణ కోరగా దొంగతనం కేసులో విచారణ చేస్తున్నామని, నిందితులను అదుపులోకి తీసుకోలేదని తెలిపారు.

‘ఏపీజీవీబీలో ప్రభుత్వ ఆదేశాల ఉల్లంఘన’

నల్లబెల్లి : మండల కేంద్రంలోని ఏపీజీవీ బ్యాంకులో పంట రుణాలకు సంబంధించి ప్రభుత్వ ఆదేశాలను అధికారులు ఉల్లంఘిస్తున్నారని బీజేపీ జిల్లా కార్యదర్శి తడుక అశోక్ విమర్శించారు. ఆ పార్టీ, ప్రజాసంఘాల సంయుక్త ఆధ్వర్యంలో బ్యాంక్ ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడారు. పంట రుణాలు మాఫీ అయిన రైతులకు ప్రభుత్వ ఆదేశాల మేరకు బ్యాంక్ అధికారులు తిరిగి పంట రుణాలు అందించాల్సి ఉందన్నారు. ప్రభుత్వ ఆదేశాలకు విరుద్ధంగా బ్యాంక్ అధికారులు పంట రుణాలను రైతు కుటుంబానికి సంబంధించిన ఇతర అప్పుల్లో జమ చేసుకుంటున్నారని ఆరోపించారు. ప్రభుత్వ ఆదేశాలను ఉల్లంఘిస్తున్న బ్యాంక్ అధికారులపై చర్యలు తీసుకోవడంతోపాటు రైతులకు పంట రుణాలు అందేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు బట్టు సాంబయ్య, బొట్ల నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ అమలులో ఆంక్షలు సరికాదు

నర్సంపేట : రుణమాఫీ అమలులో ఆంక్షలు సరికాదని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఈసంపెల్లి బాబు అన్నారు. ఆ పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఆర్డీఓ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా చేశారు. అనంతరం ఆర్డీఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాబు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ హామీ మేరకు 15 రోజులుగా రుణమాఫీ ప్రక్రియ కొనసాగుతుండగా షరతుల కారణంగా ఇప్పటివరకు 50 శాతం రైతులకు కూడా రుణమాఫీ వర్తించలేదని చెప్పారు. వివిధ ఆంక్షలతో, బ్యాంకు అధికారుల తప్పిదాలతో అర్హులైన రైతులకు రుణమాఫీ లబ్ధి చేకూరడం లేదన్నారు. ఇకనైనా ప్రభుత్వం షరతులు లేకుండా అర్హులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భూక్య సమ్మయ్య, కొరబోయిన కుమారస్వామి, జిల్లా కమిటీ సభ్యులు హన్మకొండ శ్రీధర్, బోళ్ల సాంబయ్య, తదితరులు పాల్గొన్నారు.

జీపీగా తెట్టెకుంట తండా

రాయపర్తి: మండలంలోని తిర్మలాయపల్లి గ్రామ పంచాయతీ నుంచి తెట్టెకుంట తండాను గ్రామపంచాయతీగా ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ గుగులోత్ కిషన్‌నాయక్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీ గ్రామం పేరును శివరామపురం గ్రామంగా, జయరాంతండా(ఎస్) గ్రామపంచాయతీలోని సూర్యతండా, శ్రీరాంనగర్ తండాను వెంకటేశ్వరపల్లి గ్రామపంచాయతీలో కలిపినట్లు తెలిపారు. బాలాజీతండా గ్రామపంచాయతీలోని బీల్‌నాయక్ తండా, టీకులతండాను ఊకల్ గ్రామపంచాయతీలో కలిపినట్లు గెజిట్ వచ్చినట్లు పేర్కొన్నారు.

పంటపొలాల్లో మద్యం సీసాలు

రాయపర్తి : ఆకతాయిలు రెచ్చిపోతున్నారు. మండలంలోని రహదారులు, ఖాళీగా ఉన్న పంటపొలాలే వారికి అడ్డాగా మారాయి. బీరు, బ్రాందీ తాగి సీసాలు పంటపొలాల్లో పడేస్తున్నారు. పంటపొలాల్లో పగిలిన సీసాలు కాళ్లకు గుచ్చుకుంటాయని రైతన్నలు వాపోతున్నారు. ఆకతాయిలపై అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

నివాళి

రాయపర్తి : మండలంలోని బందనపల్లిలో బీఆర్‌ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఎల్కపల్లి రమేశ్ తండ్రి సోమయ్య గురువారం మృతి చెందగా ఆయన మృతదేహానికి ఆ పార్టీ నాయకులు నివాళులర్పించారు. అనంతరం రమేశ్‌ను పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్, మండల ఉపాధ్యక్షుడు నయీమ్, మాజీ సర్పంచ్ దీప్లానాయక్, అష్రఫ్ పాషా, సంకినేని ఎల్లస్వామి పాల్గొన్నారు.

విద్యార్థుల ఉన్నతిలో ఆత్మస్థైర్యం కీలకం

నెక్కొండ : విద్యార్థుల ఉన్నతిలో ఆత్మస్థైర్యం కీలకమని ప్రముఖ మానసిక వైద్యనిపుణులు డాక్టర్ భరత్‌కుమార్ తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం నిర్వహించిన టెలీమానస్ అవేర్‌నెస్ ప్రోగ్రాం సదస్సుకు అయన హాజరై మాట్లాడారు. సెల్‌ఫోన్ అవసరమైతే తప్ప వినియోగించొద్దని చెప్పారు. సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ కరుణశ్రీ, స్టూడెంట్ కౌన్సిలర్ అశోక్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

గీసుకొండ : మండలంలోని విశ్వనాథపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు జన్ను రమేశ్ నాన్నమ్మ నర్సమ్మ అనారోగ్యంతో గురువారం మృతి చెందగా బాధిత కుటుంబానికి ఆ పార్టీ మండల అధ్యక్షులు తుమ్మనపెల్లి శ్రీనివాస్, నాయకుడు కొమ్ము శ్రీకాంత్ రూ.15 వేల సాయం అందజేశారు.

సరుకుల అందజేత

రాయపర్తి : మండలంలోని మైలారం గ్రామానికి చెందిన గంటా ప్రభాకర్ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి ఎస్‌ఆర్‌ఆర్ ఇన్‌ఫ్రా సంస్థల అధినేత పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి పంపించిన క్వింటా బియ్యం, 15 లీటర్ల మంచినూనె, ఇతర సరుకులను ఎస్‌ఆర్‌ఆర్ ఫౌండేషన్ ప్రతినిధులు గురువారం అందజేశారు. తొలుత బాధిత కుటుంబాన్ని శ్రీనివాస్‌రెడ్డి ఫోన్‌లో పరామర్శించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు రాథోడ్ సురేందర్ నాయక్, ఎస్ఎస్‌పీహెచ్‌సీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వల్లాల సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

‘యూపీఎస్’తో ఉద్యోగులను మోసగించేందుకు కుట్ర

నల్లబెల్లి : సీపీఎస్ స్థానంలో ఏకీకృత పెన్షన్ (యూపీఎస్) విధానంతో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులను, ఉపాధ్యాయులను మోసగించేందుకు కుట్ర చేస్తోందని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుజన్ ప్రసాదరావు తెలిపారు. మండలంలోని రంగాపురం, నందిగామ, నల్లబెల్లి, రుద్రగూడెం, కేజీబీవీ పాఠశాలల్లో ఆ సంఘం ఆధ్వర్యంలో గురువారం చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేస్తూ పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరినట్టు తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు అన్నాదేవి, జిల్లా కోశాధికారి అబ్దుల్ రవూఫ్, మండల ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కరువు భత్యం విడుదల చేయాలి

వర్ధన్నపేట : ఉపాధ్యాయులకు ఐదు విడతల కరువు భత్యం విడుదల చేయాలని పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు ఈదునూరి రవీందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని కేజీబీవీ, రామవరం మైనారిటీ స్కూల్, దమ్మన్నపేట పాఠశాలలను సందర్శించి సభ్యత్వ నమోదు చేశారు. ఈ సందర్భంగా రవీందర్‌రెడ్డి మాట్లాడారు. కరువు భత్యం విడుదల చేయడంతోపాటు 50 శాతం ఫిట్‌మెంట్‌తో వేతన సవరణ చేయాలని, జీపీఎఫ్, టీఎస్‌జీఎల్ఐ క్లెయిములు, మెడికల్ రీయింబర్స్‌మెంట్ చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమాల్లో నాయకులు అబ్దుల్ గఫార్, నిమ్మ మనుజేందర్‌రెడ్డి, పింగిళి అశోక్, సమ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ప్రాధాన్యం

● టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి

నెక్కొండ : అభివృద్ధి పనులకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో చేపట్టిన సీసీ రోడ్డు పనులను గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ ఎస్‌డీఎఫ్ నుంచి రూ.5 లక్షలు మంజూరు చేశారని చెప్పారు. సదరు నిధులతో సీసీ రోడ్డు పనులు చేపట్టామన్నారు. కార్యక్రమంలో నెక్కొండ మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీశ్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు బక్కి అశోక్, పెండ్యాల హరిప్రసాద్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బండి శివకుమార్, రామాలయ కమిటీ చైర్మన్ కొమ్మారెడ్డి సుధాకర్‌రెడ్డి, మసీద్ కమిటీ అధ్యక్షుడు షబ్బీర్, నాయకులు బండారుపల్లి శ్రీనివాసరావు, మహ్మద్ అన్వర్ పాషా, బొడ్డపల్లి యాదగిరి, మచ్చ వీరన్న, కర్ర చిన్నారెడ్డి, మాదాటి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతో ఎయిడ్స్ నియంత్రణ



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ గోపాల్‌రావు

● డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ గోపాల్‌రావు

గీసుకొండ : ప్రజలకు అవగాహన కల్పించడం ద్వారా ఎయిడ్స్‌ను నియంత్రించవచ్చని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ గోపాల్‌రావు తెలిపారు. పల్లె దవాఖానాల వైద్యులు, సిబ్బందికి ఎయిడ్స్ వ్యాధిపై గురువారం ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి ఆయన అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ దవాఖానాలతోపాటు ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల ద్వారా ఎయిడ్స్ పరీక్షలు ఉచితంగా చేయాలని సూచించారు. ఎయిడ్స్ లక్షణాలున్న వ్యక్తులు వెంటనే పరీక్ష చేయించుకోవాలని చెప్పారు. లైంగిక సంపర్కం, రక్త మార్పిడి, కలుషితమైన సిరంజీల ద్వారా సోకుతుందని చెప్పారు. తల్లికి రోగం ఉంటే ప్రసవ సమయంలో ఆమెకు పుట్టే బిడ్డకు సోకే అవకాశం ఉందన్నారు. ఎయిడ్స్ బాధితులు ఒత్తిడికి గురికావద్దని చెప్పారు. వైద్యుల సలహా మేరకు చికిత్స చేయించుకుంటూ పౌష్టికాహారం తీసుకోవాలని తెలిపారు. ప్రజలకు ఎయిడ్స్‌పై అవగాహన కల్పించడంతోపాటు పరీక్షలు నిర్వహించి చికిత్స అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి డాక్టర్ మోహన్ సింగ్, డీపీఎం మాధురి, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలి



దుగ్గొండి : వైద్యం చేస్తున్న డాక్టర్ పృథ్వీరాజ్



పర్వతగిరి : వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

దుగ్గొండి : సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న క్రమంలో వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలని పీహెచ్‌సీ వైద్యాధికారి పృథ్వీరాజ్ కోరారు. మండలంలోని మహ్మదాపురంలో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 85 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అలాగే 7గురికి రక్త పరీక్షలు చేశారు. అనంతరం వైద్యాధికారి పృథ్వీరాజ్ మాట్లాడారు. కాచి చల్లార్చి వడబోసిన నీటినే తాగాలని, తదితర సూచనలు చేశారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ చాణక్య, ఏఎస్ఎం సరిత, ఆశా కార్యకర్త రాజ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పర్వతగిరి : మండలంలోని సోమారం, జమలాపురం పరిధిలోని ట్రైబల్ వెల్ఫేర్ బాలికల గురుకుల పాఠశాల, పర్వతగిరి ఎస్సీ గురుకుల స్కూల్‌లో 141 మంది విద్యార్థులకు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యులు ఉదయ్‌రాజ్, యశస్విని మాట్లాడారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

మహనీయుల స్ఫూర్తితో ముందుకు సాగండి

నల్లబెల్లి : మహనీయుల స్ఫూర్తితో విద్యార్థులు ముందుకు సాగాలని రోటరీ క్లబ్ అంకుర జిల్లా అధ్యక్షుడు మహ్మద్ అలీ ఆకాంక్షించారు. ఆ క్లబ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన జాతిపిత మహాత్మగాంధీ, మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహాలను గురువారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. దేశానికి మహాత్మగాంధీ, రాధాకృష్ణన్ అందించిన సేవలను కొనియాడారు. విద్యార్థులు మహనీయుల జీవితాలను అధ్యయనం చేయాలని సూచించారు. మహాత్మగాంధీ, రాధాకృష్ణన్ స్ఫూర్తితో ముందుకు సాగాలని చెప్పారు. పాఠశాలకు మరిన్ని సేవలను అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ చదువుల సత్యనారాయణ, హెచ్‌ఎం లడే రవీందర్, అర్వయ్యపల్లి ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం కిషన్, రోటరీ క్లబ్ అంకుర ప్రధాన కార్యదర్శి జక్కుల సుభాష్, కోశాధికారి పుల్లూరి శ్రీధర్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ కనుకం అనూష, పాఠశాల శాశ్వత దాత గంగిశెట్టి శ్రీనివాస్ గుప్తా, క్లబ్ జిల్లా కమిటీ సభ్యులు నక్కిరెడ్డి మహేందర్, కందకట్ల నాగరాజు, ఉపాధ్యాయులు భద్రీనాథ్, తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలి

రాయపర్తి : అంటువ్యాధులు, విషజ్వరాలతో ప్రజలు రోగాల బారిన పడుతున్న క్రమంలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలని ఎంసీపీఐ(యూ) జిల్లా కమిటీ సభ్యుడు గుగులోతు అరుణ్‌నాయక్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని అస్పత్రుల్లో, పీహెచ్‌సీల్లో డెంగీ నిర్ధారణ కిట్లు అందుబాటులో ఉంచాలని, డెంగీతో మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వరంగల్ రూరల్ :
9951602875 9553955722
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
డి. రాజు యాదవ్ (S.R) : 9502950309 (వర్ధన్నపేట
ఎం. మురారి (S.R) : 9502950309 (నర్సంపేట)
పి.చంద్రశేఖర్ (A.C.O) : 9963646944